సాక్షి
చిత్తూరు
ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



ఊపందుకున్న ఆన్‌లైన్ వసూళ్లు
జిల్లాలో కరెంట్ బిల్లుల డిజిటల్ చెల్లింపులు 67 శాతానికి పెరిగాయి. వినియోగదారులకు సమయం ఆదా అవుతోంది. - 8లో



అర్హత మేరకు అక్రిడిటేషన్ కార్డులు
వర్కింగ్ జర్నలిస్టులకు అర్హత మేరకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	24
తిరుపతి	34	25
తిరుమల	29	20
గూడూరు	36	27
నగరి	35	25

న్యూస్‌రీల్

29న హుండీ కానుకల లెక్కింపు

కాణిపాకం(యాదమరి):కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ కానుకలను ఈ నెల 29న లెక్కించనున్నట్లు దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం 7 గంటలకు ఆలయ ఆస్థాన మండపంలో నిర్వహించే హుండీ కానుకల లెక్కింపునకు ఆలయ అధికారులు, సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ చేపడుతున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్-2024లో భాగంగా పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 1,737 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. వీటిలో వివిధ కారణాలతో పోలింగ్ కేంద్రాల ప్రదేశం మార్పు, పేరు మార్పు, నూతనంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వీటిపై రాజకీయ పార్టీల అభిప్రాయాలు ఎప్పటికప్పుడు తీసుకుంటున్నామన్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ స్పష్టం చేశారు.

డ్రాపౌట్స్‌ను స్కూళ్లలో చేర్చాలి

చిత్తూరు కలెక్టరేట్: పాఠశాలలకు వెళ్లకుండా గుర్తించిన పిల్లలను తక్షణం స్కూళ్లలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఈవో విజయేంద్రరావు ఆదేశించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోకు సంబంధించి క్లస్టర్ల వారీగా పూర్తి స్థాయి సర్వే నిర్వహించేలా ఎంఈవోలు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. చైల్డ్ ఇన్ఫో ప్రకారం ఎడ్యుకేషన్ సర్వేలో వివరాలు సక్రమంగా ఉండేలా ఎంఈవోలు పర్యవేక్షించాలని డీఈవో తెలిపారు.

రికార్డులు పరిశీలించిన జిల్లా జడ్జి




జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావుతో జడ్జిలు, న్యాయవాదులు

గంగవరం: పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టును జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు శనివారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న జడ్జిల నివాసాల భవనాలను పరిశీలించారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేయాలంటూ న్యాయమూర్తిని ఈ సందర్భంగా అడ్వకేట్ల బృందం కలిసి విన్నవించగా, తప్పనిసరిగా సహకరిస్తానని తెలిపారు. జిల్లా న్యాయమూర్తిని సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి రవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీపతి, న్యాయవాదులు సత్కరించారు. అనంతరం న్యాయమూర్తిని పలమనేరు సీఐ, మున్సిపల్ కమిషనర్, పలమనేరు, గంగవరం తహసీల్దార్లు మర్యాద పూర్వకంగా కలిశారు.

ఎన్ఎంఎస్ఎస్ దరఖాస్తు గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్ : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష దరఖాస్తుకు ఈనెల 25 వరకు గడువు పొడిగించినట్లు డీఈవో విజయేంద్రరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 3న పరీక్ష ఉంటుందన్నారు. జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, ఎంపీపీ, ఉన్నత పాఠశాలలు, హాస్టల్ వసతి లేని మోడల్ స్కూళ్లలో ఈ విద్యా సంవత్సరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులని వెల్లడించారు. వివరాల కోసం డీఈవో కార్యాలయంలోని పరీక్షల విభాగంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

రామయ్య తీరున.. బంగారు తేరున..



పెరిగినాడు చూడరో పెద్ద హనుమంతుడు

బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే!

రంగ రంగ రంగపతి రంగనాథ!

గజ గోవిందం

శ్రీరాముడి అలంకరణలో కళాకారులు

స్వర్ణరథంపై స్వామి, అమ్మవార్లు

- అంగరంగ వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- ఆరో రోజు మూడు వాహనాలపై విహరించిన ముగ్ధమనోహరుడు
- ఉదయం హనుమంత, సాయంత్రం స్వర్ణరథం, రాత్రి గజ వాహనంపై ఊరేగిన మలయప్ప

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఆరో రోజు శనివారం మలయప్ప స్వామి మూడు వాహనాల్లో ఊరేగుతూ మురిపించారు. ఉదయం భక్తుల్లో అగ్రగణ్యుడైన హనుమంత వాహనాన్ని అధిరోహించి భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం ధగధగా మెరుస్తున్న స్వర్ణరథంపై విహరిస్తూ ఆకట్టుకున్నారు. రాత్రి గజవాహనంపై తిరుగుతూ కనువిందుచేశారు. దేవదేవుని దివ్యమంగళరూపాన్ని దర్శించి భక్తులు పునీతులయ్యారు. వాహన సేవల ముందు కళాబృందాల ప్రదర్శన ఆకట్టుకుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను ఆలయ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి పర్యవేక్షించారు. - తిరుమల


భవన నిర్మాణాల లక్ష్యాలను అధిగమించాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సచివాలయాలు, రైతుభరోసా, హెల్త్‌క్లినిక్ భవనాల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల పనులు అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేసి, అప్పగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మండలానికి వారానికి నిర్దేశించిన లక్ష్యాలను ఆసమయంలోనే పూర్తి చేయాలని ఎంపీడీఓలు, ఇంజినీర్లను ఆదేశించారు. బిల్లులను పెండింగ్ లేకుండా చెల్లించాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ 72 సచివాలయాలు, 58 రైతు భరోసా కేంద్రాలు, 72 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలకు ప్లంబింగ్, విద్యుత్, చిన్న చిన్న పనులను పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు. పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 519 సచివాలయ భవనాల నిర్మాణాలకు గానూ 278 పూర్తి చేసినట్లు తెలిపారు. 504 ఆర్‌బీకే నిర్మాణాలకు గానూ 272, 351 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల భవనాలకు గానూ 79 పూర్తి చేసినట్లు వివరించారు.

వృషభంపై వరసిద్ధుని వైభవం



ఉదయం చిలుక వాహనంపై గణనాథుని ఊరేగింపు



రాత్రి వృషభ వాహనంపై ఉభయ దేవేరులతో స్వామివారి విహారం



కాణిపాకం స్వయంభూ శ్రీవరసిద్ధి వినాయకస్వామి శనివారం ఉదయం చిలుక, రాత్రి వృషభ వాహనంపై విహరించారు. కోలాటాలు.. చెక్క భజనలు..మేళతాళాలు.. మంగళ వాయిద్యాల నడుమ వాహన సేవలను తిలకించి అశేష భక్తులు పరవశించారు.

కాణిపాకం(యాదమరి): స్వయంభు శ్రీకాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శనివారం రాత్రి తండ్రి వాహనం అయిన వృషభంపై పుర వీధుల్లో విహరిస్తూ ఏకదంతుడు భక్తులను కటాక్షించారు. ఆలయంలో బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. శనివారం ఉదయం మూలస్థానంలోని స్వామివారికి విశేష అభిషేక పూజలు, అలంకరణల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం చిలుక వాహన ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేక పూజల జరిగాయి. తదుపరి అలంకార మండపంలో శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేసి చిలుక వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం పురవీధుల్లో ఊరేగింపు సాగుతుండగా భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. రాత్రి అలంకార మండపంలో ఉభయదేవేరుల సహా వినాయకస్వామి ఉత్సవమూర్తులను పట్టు పీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి ఉభయదారులు, ఆలయ అధికారులు పల్లకిలో ఊరేగింపుగా తీసుకు వచ్చి వృషభ వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం ఊరేగింపు నయనానందకరంగా సాగింది. దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓ ఎస్వీ కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆలయ ఆస్థాన మండపంలో నృత్య, నాటక ప్రదర్శనలు భక్తులను కట్టిపడేశాయి.

రథోత్సవానికి ఏర్పాట్లు



రథంపై కలశం, ఛత్రం, బ్రహ్మ విగ్రహం ఏర్పాటు

బ్రహ్మోత్సవాల్లో అత్యంత్య కీలకమైన రథోత్సవం సోమవారం జరుగనుంది. శనివారం ఉదయం ప్రధాన ఆలయంలోని మండపంలో రథకలశం, ఛత్రం, బ్రహ్మ విగ్రహానికి సంప్రోక్షణ పూజలు నిర్వహించారు.

నేడు గజవాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి గజ వాహనంపై స్వామి వారు పురవీధుల్లో విహరిస్తారు. ఉదయం విశేష అభిషేక పూజలు ఉంటాయి. ఆస్థాన మండపం వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

క్లుప్తంగా

పెద్దకొండామర్రి చెరువుకు గండి



గండి పూడ్చి వేత పనుల్లో అధికారులు, రైతులు

చౌడేపల్లె: పెద్దకొండామర్రి కప్పా పెద్ద చెరువుకు శనివారం గండి పడింది. మూడు రోజులుగా మండల వ్యాప్తంగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. వర్షపు నీరు చెరువులోకి చేరుతున్న క్రమంలో తూము సమీపంలో కట్టకు గండి పడింది. వర్షపు నీరంతా బయటకు వెళుతుండడాన్ని రైతులు గుర్తించారు. వీఆర్వోలు మల్లికార్జునరెడ్డి, అశోక్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. స్పందించిన అధికారులు సర్పంచ్ జయసుధమ్మ ఆధ్వర్యంలో జేసీబీతో గండిని పూడ్చి, కట్టకు మట్టిని తోలి నీటి వృథాను అరికట్టేలా చర్యలు చేపట్టారు. ఆయకట్టు రైతులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు తక్షణం బిల్లుల చెల్లింపు



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా గృహ నిర్మాణ పనులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. గృహ నిర్మాణల పురోగతిపై హౌసింగ్ శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. లక్ష్యాలను అధికమించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లైతే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతిని హౌసింగ్ పీడీ పద్మనాభం వివరించారు.

ఊపందుకున్న ఆన్‌లైన్ చెల్లింపులు

టెక్నాలజీని ట్రాన్స్‌కో అందిపుచ్చుకుంటోంది. గతంలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు, సర్వీస్ కనెక్షన్, అదనపు లోడ్ కోసం నగదును మాన్యువల్‌గా అందజేయాల్సి వచ్చేది. కార్యాలయాల వద్ద పడిగాపులు తప్పేదికాదు. విద్యుత్ శాఖ డిజిటల్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకు రావడంతో లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లాలో డిజిటల్ పేమెంట్స్ 67 శాతానికి పెరిగాయి.

- 67 శాతం వరకు విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్ పేమెంట్స్
- వినియోగదారులకు సమయం, డబ్బు ఆదా
- వందశాతం ఆన్‌లైన్ చెల్లింపులే లక్ష్యంగా ట్రాన్స్‌కో



డివిజన్	విద్యుత్ సర్వీసులు	డిజిటల్ చెల్లింపులు రూ.కోట్లు	నగదు రూపంలో రూ.కోట్లు
చిత్తూరు రూరల్	85182	రూ.2.31	రూ.1.90
చిత్తూరు నగరం	168901	రూ.8.13	రూ.4.19
మదనపల్లె	216114	రూ.6.46	రూ.3.51
పీలేరు	133725	రూ.3.02	రూ.3.01
పుంగనూరు	221089	రూ.4.62	రూ.4.23
పుత్తూరు	215107	రూ.6.15	రూ.6.23
తిరుపతి రూరల్	190015	రూ.9.22	రూ.4.51
తిరుపతి నగరం	310203	రూ.32.97	రూ.7.16
మొత్తం	1540336	రూ.71.16	రూ.34.74

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లాలో పరిధిలో ఆన్‌లైన్ చెల్లింపులు గణనీయంగా పెరిగాయి. మొత్తం గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు మొత్తం 15,40,336 ఉన్నాయి. ఈ సర్వీసుల కింద విద్యుత్ బిల్లుల ద్వారా రూ.105.90 కోట్లు వసూలు అవుతోంది. వీటిలో రూ.34.74 కోట్లు కార్యాలయ కౌంటర్ల నుంచి నగదు రూపంలో వస్తోంది. మిగిలిన రూ.71.16 కోట్లు(67శాతం) డిజిటల్ పద్ధతిలో వసూలవుతోంది. ఆండ్రాయిడ్ మొబైల్ ద్వారా ఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్, యాప్, గూగుల్, ఫోన్ పే యాప్‌ల ద్వారా బిల్లులను చెల్లించడం ద్వారా వినియోగదారుల సమయం ఆదా అవుతోంది. వసూలు కేంద్రాల వద్ద గంటల తరబడి క్యూలో నిలబడే బాధ తప్పుతోంది. ఈ సేవా కేంద్రాల్లో సర్వీస్ ట్యాక్స్ రూపంలో చెల్లించే అదనపు నగదు మిగులుతోంది.



అవగాహన పెరిగింది

ట్రాన్స్‌కో జిల్లా పరిధిలో ఆన్‌లైన్‌లో బిల్లుల వసూళ్లు పెరుగుతున్నాయి. వినియోగదారులకు అవగాహనతో డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. త ద్వారా సమయం ఆదా అవుతోంది. ప్రస్తుతం జిల్లాలో 67 శాతం ఉన్న డిజిటల్ పేమెంట్లను వంద శాతానికి తీసుకురావాలని లక్ష్యంగా నిర్ణయించాం.

– కృష్ణారెడ్డి, ఎస్ఈ, ట్రాన్స్‌కో

డిమాండున్న కోర్సుల్లో నైపుణ్యత సాధించాలి



మాట్లాడుతున్న మంత్రి ఆర్కేరోజా

- మంత్రి ఆర్కే రోజా
- కలెక్టరేట్‌లో మల్టీ స్కిల్ వర్క్‌షాప్

తిరుపతి అర్బన్: మార్కెట్లో బాగా డిమాండున్న కోర్సుల్లో నైపుణ్యత సాధించాలని పర్యాటక, యువజన, సాంస్కృతిక క్రీడాశాఖా మంత్రి ఆర్కే.రోజా తెలిపారు. కలెక్టరేట్‌లో సెట్విన్ నేతృత్వంలో యువజన సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా శని, ఆదివారాలు రెండు రోజుల పాటు మెగా మల్టీ స్కిల్డ్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఉద్యోగ అవకాశాలు ఎలా పొందాలి, ఏఏ అంశాల్లో పట్టు సాధించాలనే విషయాలను ఈ వర్క్‌షాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉచితంగా శిక్షణ అందిస్తున్న హెచ్‌జీ మీడియా వారికి, త్రివేణి ఆర్ట్స్ వారికి, వారికి సహకరిస్తున్న ప్రవీణ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ శిక్షణలో యానిమేషన్, మల్టీమీడియా అప్లికేషన్స్, ఫొటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ మార్కెటింగ్, వెబ్‌సైట్ మేకింగ్, పర్సనాలిటీ డెవలప్మెంట్, సాఫ్ట్ స్కిల్స్, మోటివేషనల్ క్లాసెస్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ మాట్లాడుతూ వర్క్‌షాప్‌నకు హాజరైన యువతకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో సెట్విన్ మేనేజర్ మోహన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు అస్వస్థత

- రుయాలో కోలుకుంటున్న విద్యార్థులు



రుయాలో పిల్లలకు చికిత్స అందిస్తున్న డాక్టర్

పుత్తూరు రూరల్: వడమాలపేట మండలం బంగారెడ్డి కండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలోని నలుగురు పిల్లలు శనివారం అస్వస్థతకు గురై, తిరుపతి రుయాలో కోలుకుంటున్నారు. సీడీపీఓ పద్మజ కథనం మేరకు.. శనివారం మధ్యాహ్నం యథావిధిగా ఎనిమిది మంది పిల్లలకు మెనూ ప్రకారం విజటబుల్ రైస్ పెట్టారు. అనంతరం కొద్ది సేపటికి ఎస్.బాలరాజు(4), పి.హర్షవర్ధన్(4), టి.గుణశేఖర్(4), ఎస్.అను(3) వాంతులు చేసుకున్నారు. వెంటనే అంగన్‌వాడీ వర్కర్ నీరజ 108కి ఫోన్ చేసి, సీడీపీఓ పద్మజకు సమాచారం అందించారు. 108 రావడానికి ఆలస్యం అవుతున్న నేపథ్యంలో పిల్లలను ఆటోలో ముందుగా రామచంద్రాపురం మండలం కుప్పంబాదూరు ఆస్పత్రికి తీసుకెళ్లి, అక్కడి నుంచి తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ వైద్యుల పర్యవేక్షణలో పిల్లలు కోలుకుంటున్నారు. భోజనం జీర్ణం కాకపోవడంతో వాంతులు అయ్యాయని, ప్రమాదం ఏమీ లేదని డాక్టర్లు చెప్పినట్లు సీడీపీఓ పద్మజ తెలిపారు. పిల్లల తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు.

అర్హత మేరకు అక్రిడిటేషన్ కార్డులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో వివిధ సంస్థల్లో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు అర్హత మేరకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అక్రిడిటేషన్ రెండవ కమిటీ సమావేశం నిర్వహించారు. అజెండా మేరకు అక్రిడిటేషన్‌ల మంజూరుపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో ఎంఎస్ 38 నియమ, నిబంధనల మేరకు వర్కింగ్ జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, ఫ్రీలాన్స్, వెటరన్ జర్నలిస్టులకు 2024 డిసెంబర్ వరకు కార్డులను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన మొదటి సమావేశంలో 293 మందికి కార్డులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. జర్నలిస్టులకు జిల్లా యంత్రాంగం తరుపున తమ వంతు సహాయం ఉంటుందని అన్నారు. కమిటీ కన్వీనర్ పద్మజ మాట్లాడుతూ జిల్లాలో ప్రింట్, పెద్ద, చిన్న దిన పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్ న్యూస్ ఛానెల్స్, మాసపత్రికలు, వెటరన్ జర్నలిస్టుల తరపున 120 దరఖాస్తులు వచ్చాయన్నారు. నిబంధనలు పాటిస్తూ కమిటీలో చర్చించి తీసుకున్న నిర్ణయాల మేరకు రెండవ విడత అక్రిడిటేషన్‌లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు హౌసింగ్ పీడీ పద్మనాభం, లేబర్ ఆఫీసర్ ఓంకార్ రావ్, డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి, శివప్రసాద్, సురేంద్రరెడ్డి, శ్రీకాంత్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

26న ఎస్వీయూలో జాబ్ మేళా

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీ ఉదయం 9.30 గంటలకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ టీ.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో భార్గవి ఆటోమోబైల్స్, ఎస్‌బీబీ మెడికేర్, అపోలో ఫార్మసీ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 206 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పది, ఐటీఐ, ఇంటర్, డిప్లొమో, ఫార్మసీ, బీటెక్, డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. వివరాలకు యూనివర్సిటీలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో సంప్రదించవచ్చని సూచించారు.

కలెక్టరేట్ విభాగాల్లో మార్పులు

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లోని పలు విభాగాల్లో మార్పులు, విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటి వరకు కలెక్టరేట్‌లో ఏ,బీ,సీ,డీ,ఈ,ఎఫ్,జీ, హెచ్ విభాగాల్లో సేవలందించేవారు. ఏ-విభాగంలో పరిపాలన, బీ-విభాగంలో అకౌంట్స్, ఆడిట్, సీ-విభాగంలో న్యాయపరమైన, డీ-విభాగంలో భూ రెవెన్యూ, రిలీఫ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఈ-విభాగంలో భూ పరిపాలన, ఎఫ్-విభాగంలో ల్యాండ్ రీఫామ్స్, జీ-విభాగంలో భూ సేకరణ, హెచ్-విభాగంలో ప్రోటోకాల్, ఎన్నికల వ్యవహారాలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆ విభాగాల్లో మార్పులు, పేర్లల్లో మార్పులు చేశారు. ఏ, బీ విభాగాలను పరిపాలన విభాగంగా, సీ-విభాగాన్ని మెజిస్టీరియల్ విభాగంగా మార్చారు. అలాగే డీ,హెచ్ విభాగాలను కోఆర్డినేషన్ విభాగంగా, ఎఫ్-విభాగాన్ని ల్యాండ్ రీఫామ్స్ విభాగంగా, జీ, ఈ-విభాగాలను ల్యాండ్ అడ్మినిస్టేషన్ విభాగంగా మార్పు చేశారు.

భవ్యశ్రీ మృతిపై సమగ్రమైన విచారణ

పెనుమూరు(కార్వేటి నగరం) : అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విద్యార్థి భవ్యశ్రీ కేసులో సమగ్రమైన, నిష్పాక్షిక దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. ఈ కేసులో సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు, ఊహాగానాలు ఊపందుకోవడంతో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేణుగోపాలపురానికి చెందిన భవ్యశ్రీ తండ్రి మునికృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు. నలుగురు యువకులపై అనుమానం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. పోస్టుమార్టంలో శరీరంపై ఎలాంటి గాయాలు లేవని ప్రాథమికంగా తెలిసిందన్నారు. అఘాయిత్యం జరిగిందా, విషప్రయోగం జరిగిందా అని పరీక్షించేందుకు సాంపిల్స్ తీసుకున్నట్లు పేర్కొన్నారు. నీటిలో మునిగి ఊపిరాడక చనిపోయిందా? ఎక్కడి నుంచి అయినా తెచ్చి ఆమె మృతదేహాన్ని బావిలో పడేశారా అన్న విషయం తేల్చేందుకు స్టెరమ్‌బోన్ సాంపిల్స్‌ను కెమికల్ అనాలసిస్ కోసం తిరుపతి ఆర్ఎఫ్ఎస్ఎల్‌కు పంపుతున్నట్లు పేర్కొన్నారు. ఆనివేదికలు వచ్చిన అనంతరం అనుమానితులను సమగ్రంగా, నిష్పాక్షికంగా విచారిస్తామన్నారు. విచారణను తప్పుదారి పట్టించేలా అసత్య ప్రచారాలను, నిరాధార వార్తలను ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.